



ఆర్‌యూ స్నాతకోత్సవానికి దరఖాస్తులు

కర్నూలు అర్బన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ) నాలుగో స్నాతకోత్స వానికి సంబంధించి ఈనెల 11 నుంచి 25 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఉపకు లపతి వి. వెంకట బసవరావు ఒక ప్రకట నలో తెలిపారు. 2024-25 సంవత్సరం వరకు వివిధ అర్హత సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో వర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. స్నాత కోత్సవానికి సంబంధించి 4 సెప్టెంబరు 2023 నుంచి 16 మే 2024 మధ్య దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు.

జిల్లాలోని మండల స్థాయి అధికారులు ప్రజాపరిపాలనను గాలికొదిలేశారు. ఒక్కో మండలంలోని 10నుంచి 25 దాకా గ్రామాలు కలవు. ప్రతి రోజూ ఏదో ఒక సమస్య పరిష్కారంపై తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు ప్రజలు, రైతులు, ప్రజా సంఘాలు, సామాజిక కార్యకర్తలు వస్తారు. వినతిపత్రా(అర్జీలు)లు సమర్పిస్తారు. వాటిని కనీసం చూడకుండా చెత్తబుట్టలో వేస్తున్నారు. పైసలు వచ్చే అర్జీలను మాత్రం క్షణాల్లో పరిష్కరిస్తున్నారు. పైసలిచ్చుకోని వారికి అధికారులు న్యాయం చేయడం లేదని విమర్శలున్నాయి.



చెత్తబుట్ట అర్జీల గుట్ట..!

- పైసలిస్తేనే పరిష్కారం
- లేదంటే సాకులతో పక్కన పడేస్తున్న వైనం
- తూతూ మంత్రంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- మండలాల్లో ఫెవికాల్ వీరులుగా వీఆర్వోలు, కార్యదర్శులు
- పర్యవేక్షించని ఉన్నతాధికారులు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యల పరిష్కారం కోసం మండలంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు వచ్చే అర్జీలు చెత్తబుట్టలోకి చేరుతున్నాయి. చెత్తబుట్టల్లో గుట్టలుగా పేరుకుపోతున్నాయి. పైసలిస్తే మాత్రం అర్జీలకు పరిష్కారం సత్వరమే దొరకుతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వస్తున్న అర్జీల్లో దాదాపు 80శాతం రెవెన్యూ, భూసర్వే శాఖకు సంబంధించినవే. భూములు సర్వే చేయాలని, ఆన్‌లైన్ చేయలేదని, ఎల్పీఎం నెంబర్ విభజన జరగలేదని, తమ ఆధార్‌తో ఇతర భూములు అనుసంధానం అయ్యాయని, ఇలా పలు రకాల సమస్యలతో అర్జీలు ఇస్తున్నారు. వాటిని అధికారులు తహసీల్దార్ కార్యాలయాలకు పంపుతున్నారు. అక్కడి నుంచి గ్రామాల వారీగా వీఆర్వోలు, సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి. పరిష్కార మార్గం చూపకపోగా గడువు సమీపిస్తున్న వేళ అర్జీదారుని వద్దకు వెళ్లి పరిష్కారమైందంటూ సంతకం చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. అర్జీదారులు అంగీకరించకపోతే సాంకేతిక కారణాలను సాకుగా చూపి అంతటితో ముగిస్తున్నారు. మండలంలో పనిచేసే వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ఫెవికాల్ వీరులుగా మారారు. దాదాపు 10 నుంచి 20 సంవత్సరాలకు పైబడి ఒకే మండలంలో కొనసాగుతున్నారు.



మండల తహసీల్దార్ కార్యాలయం బోర్డు

సచివాలయ తప్పిన ఉద్యోగులు

వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారు. సచివాలయ అధికారులు గ్రామ ప్రజలకు ప్రభుత్వ పథకాలపై కనీస సమాచారమివ్వడం లేదు. నిరక్షరాస్యులు అత్యధికంగా గ్రామాల్లోనే నివసిస్తున్నారు. కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం రోజుల తరబడి సచివాలయాల చుట్టూ తిప్పుతున్నారు. ఉద్యోగులు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12లోపు విధులకు హాజరవుతున్నారు. తహసీల్దార్, ఎంపీడీవోలు సచివాలయాలను తనిఖీ చేసిన దాఖలాలు లేవు.

భూసర్వేలో తప్పిదాలు..

జగనన్న భూసర్వేలో అనేక తప్పిదాలు జరిగాయి. చాలా మంది రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సర్వే, రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదాలకు అడంగల్, 1బీ, ఆర్వోఆర్, ఎన్‌వోసీ, ఈసీ అంటూ అధికారులు రైతులను వేధింపులకు గురి చేస్తున్నారు. చదువుకోని రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు.

అత్యధికంగా రీసర్వే, రెవెన్యూ డిపార్టుమెంట్

రీసర్వే శాఖలో 20,577, రెవెన్యూ శాఖలో 18,621, పోలీసు డిపార్టుమెంట్‌లో 5,060, మున్సిపాలిటీలో 2,183, పంచాయతీరాజ్ 1,002, సమగ్ర శిక్ష 565, హౌసింగ్ 534, సివిల్ సప్లయ్ 532, అగ్రికల్చర్ 502, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 436 అర్జీలు వచ్చాయి.

ఇప్పటి వరకు వచ్చిన అర్జీల వివరాలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది జూన్ 15 నుంచి అక్టోబరు 8వ తేదీ వరకు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వివరాలు:

- మొత్తం అర్జీలు : 55,227
- పరిష్కారం చూపినవి : 49,146
- పురోగతిలో ఉన్నవి 2,850
- పెండింగ్‌లో ఉన్నవి 401
- ఇంకా చూడని దరఖాస్తులు 51

శ్రీశైలం ట్రస్టు బోర్డులో స్వల్పమార్పులు

- ఇద్దరి పేర్ల తొలగింపు
- నూతనంగా గిల్లెల శ్రీదేవికి చోటు

నంద్యాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఆలయ పాలక మండలి కమిటీలో స్వల్ప మార్పులతో నూతన బోర్డును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. పాలకమండలిలో బోర్డు సభ్యుల నియామకంపై ఇటీవలి కాలంలో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం ముందుగా ప్రకటించిన వారిలో ఇద్దరి పేర్లను తొలగిస్తూ.. ఆ స్థానంలో మరో ఇద్దరికి అవకాశం కల్పించింది. బోర్డు చైర్మన్‌తో పాటు 17 మందితో కూడిన కమిటీని ప్రభుత్వం ప్రకటించింది. ఇదిలా ఉండగా కమిటీ సభ్యురాలిగా నంద్యాలకు చెందిన డాక్టర్ సింధుశ్రీ, ప్రత్యేక ఆహ్వానితుడిగా డోన్‌కు చెందిన బుగ్గన చంద్రమౌళీశ్వర్ రెడ్డిని మొదట పాలకమండలిలోకి తీసుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే తుది జాబితాలో మాత్రం ఆ ఇద్దరి పేర్లను తొలగించింది. వారి స్థానంలో నంద్యాలకు చెందిన గిల్లెల శ్రీదేవిని కమిటీలోకి తీసుకున్నారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేద్దాం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పిలుపు


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఈనెల 16న జిల్లాలో జరిగే ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేద్దామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ హాజరయ్యారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ మోదీ సభకు 3లక్షల నుంచి 5 లక్షల మందిని సమీకరించడానికి కృషిచేస్తున్నామని తెలిపారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఊరట కల్పించే దిశగా చారిత్రక నిర్ణయం తీసుకున్నారన్నారు. ఎంపీ నాగరాజు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ప్రయోజనం కలుగుతోందని అన్నారు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ కూటమి పాలనలో ఎక్కడ చూసినా అభివృద్ధి, సంక్షేమం దిశగా రాష్ట్రం పయనిస్తోందని, దీంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు అంటేనే ఓ విజనరీ అనేది ప్రధాని సైతం గుర్తించారని, చంద్రబాబు తలపెట్టే ప్రతి కార్యక్రమాన్ని మోదీ ప్రత్యేకంగా మద్దతు తెలుపుతున్నారని అన్నారు. సోమిశెట్టి మాట్లాడుతూ ప్రధాని పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో కలిసి పని చేస్తామన్నారు. అనంతరం మోదీ పర్యటన ఏర్పాట్లకు పరిశీలించడానికి నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు వెళ్లారు. ఈ సమావేశంలో టీడీపీ ఆదోని ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, మాజీ ఎంపీ సంజీవకుమార్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణ, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు వి.హనుమంతరావు చౌదరి, బేతం కృష్ణుడు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్, కేవీ సుబ్బారెడ్డి, కార్పొరేటర్ పద్మలతారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల ఫీజు గడువు పొడిగింపు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు శుక్రవారం ముగిసిందని, అయితే ఈ నెల 22వ తేదీ వరకు గడువును పొడిగించినట్లు ఆర్‌ఐవో జి.లాలెప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్, ఒకేషనల్ కోర్సులు చదివే ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్, ప్రైవేటు పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గడువులోపు ఫీజు చెల్లించాలన్నారు. రూ.1000 ఆలస్య రుసుంతో ఈ నెల 30వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని, ఇదే చివరి అవకాశం అని, మరోసారి పొడిగింపు ఉండదని ఆర్‌ఐవో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులందరూ పరీక్ష ఫీజును చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కళాశాలల ప్రిన్సిపాళ్లకు సూచించారు.

ముమ్మరంగా పనులు

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- గ్యాలరీ నిర్మాణ పనుల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని నరేంద్ర మోదీ కర్నూలు జిల్లా పర్యటనకు సంబంధించి సభా ఏర్పాట్ల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నన్నూరు టోల్‌ప్లాజా సమీపంలోని రాగమయూరి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ప్రధాని ప్రోగ్రాం స్పెషల్ ఆఫీసర్, సీనియర్ ఐఏఎస్ అధికారి వీరపాండియన్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. ముందుగా స్టేజీ వద్ద జరుగుతున్న పనుల వివరాలు తెలుసుకున్నారు. గ్యాలరీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ జరుగుతున్న పనుల వివరాలు వెల్లడించారు. హెలీప్యాడ్, వీవీఐపీ రోడ్లు, వీవీఐపీ పార్కింగ్ పనులు, పబ్లిక్ వచ్చేందుకు రోడ్లు, వాహనాల పార్కింగ్ పనుల పురోగతిని తెలుసుకున్నారు. నిర్దేశించిన గడువు కన్నా ముందే పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించిన ఐఏఎస్ అధికారులతో మంత్రి మాట్లాడారు.

కర్నూలులో ఇన్నోవేషన్ కేంద్రం

- పారిశ్రామిక ఎస్టేట్ అభివృద్ధికి శ్రీకారం
- ఓర్వకల్లులో మహిళా శక్తి భవన్, మహిళా పారిశ్రామిక ఎస్టేట్
- భూములు కేటాయిస్తూ మంత్రివర్గం ఆమోదం



కర్నూలు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఇన్నోవేషన్ సెంటర్, పారిశ్రామిక ఎస్టేట్ అభివృద్ధికి అవసరమైన భూములు కేటాయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. శుక్రవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. జిల్లాకు చెందిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ హాజరయ్యారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ఊతం ఇచ్చేలా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇన్నోవేషన్ సెంటర్, పారిశ్రామిక ఎస్టేట్ అభివృద్ధి ద్వారా రూ.వేల కోట్లు పెట్టుబడులు రావడమే కాకుండా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇన్నోవేషన్ సెంటర్ ద్వారా సరికొత్త ఆలోచనలు ఆచరణలో పెట్టడం, నూతన పరికరాలు, యంత్రాలు అవిష్కరణకు అవకాశం ఏర్పడుతుంది. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడం ద్వారా టమోటా, ఉల్లి, మిరప.. వంటి ఉత్పత్తులకు డిమాండ్, ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఆంపిన్ ఎనర్జీ ట్రాన్సిషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ విండ్ సోలార్ హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం విండ్, సోలార్ సామర్థ్యం 349.50 మిలియన్ యూనిట్ల (ఎండబ్ల్యూ)కు పెంచుకోవడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో రెండు జిల్లాల్లో పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు పెరగుతాయి. ఓర్వకల్లులో అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌పెన్యూర్స్ ఆఫ్ ఇండియా (ఏఎల్ఈఏపీ) రూ.36.25 కోట్లతో మహిళా శక్తి భవన్, మహిళా పారిశ్రామిక ఎస్టేట్ స్థాపించేందుకు ముందుకు వచ్చింది. మూడు వేల మంది మహిళలకు ఉద్యోగాలు సృష్టించే ఈ సంస్థలకు ఎకరం రూ.10 లక్షలు చొప్పున 30 ఎకరాలు కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే ఓర్వకల్లు వద్ద రూ.33 కోట్లు పెట్టుబడితో 200 మందికి ఉపాధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఫ్రెష్ బౌల్ హార్టికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పుట్టగొడుగులు (మష్రూమ్) యూనిట్ విస్తరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

తరగతి గదులు దుర్భరం


శిరివెళ్ల ఎస్సీ కాలనీలోని స్పెషల్ మోడల్ ప్రైమరీ స్కూల్

- పెచ్చులూడి.. కూలేందుకు సిద్ధం
- బిక్కుబిక్కుమంటూ సాగుతున్న విద్యాభ్యాసం
- భయాందోళనలో విద్యార్థులు

శిరివెళ్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు చదువుకుంటున్నారు. పెచ్చులూడిన తరగతి గదుల పైకప్పులు.. కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనం గోడలను చూస్తుంటే ఏ క్షణాన ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

వరండాలో విద్యా బోధన

శిరివెళ్ల ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ స్పెషల్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో 63 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఐదుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల కోసం ఉన్న రెండు తరగతి గదులు పూర్తిగా శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో ఓ తరగతి గదిని వినియోగించడం లేదు. మరో గదిలో సైతం పైకప్పు పెచ్చులూడినప్పటికీ చేసేదేమీ లేక మూడు తరగతుల విద్యార్థులకు ఒకేచోట, మరో రెండు తరగతుల విద్యార్థులకు ఉపాధ్యాయులు వరండాలో విద్యాబోధన చేస్తున్నారు. పెచ్చులూడిన పైకప్పులు, వర్షానికి పాచి పట్టి కుంగిన గోడలు ఎప్పుడు కూలుతాయో తెలియక విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువుకుంటున్నారు.


వరండాలో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులు



నూతన భవనాలను నిర్మించే ప్రక్రియ..

మండలంలోని గుంప్రమాన్‌దిన్నె మజారా గ్రామమైన రాజనగరం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెండు తరగతిగదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలోని ఓ తరగతిగదిలోకి చేర్చి విద్యాబోధన చేస్తున్నారు. పాఠశాలకు నూతన భవనాలను నిర్మించే ప్రక్రియ నేటికీ ముందుకు సాగడం లేదు.


పెచ్చులూడిన తరగతి గదిలో చదువుకుంటున్న విద్యార్థులు



ప్రతిపాదనలు పంపించాం

శిరివెళ్ల, రాజనగరం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని పూర్తిగా ధ్వంసం చేసి కొత్త భవనాలను నిర్మించాలని సర్వశిక్షా అభియాన్‌కు ప్రతిపాదనలు పంపించాం. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాం.

● డీటీ శంకర్ ప్రసాద్, డిప్యూటీ డీఈవో

నివేదిక రూపొందిస్తున్నాం



శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల తరగతిగదులను పరిశీలించాం. నూతన భవనాలను నిర్మించాలని నివేదిక రూపొందించి విద్యాశాఖ ఉన్నతాధికారులతో పాటు కలెక్టర్‌కు నివేదికలు అందజేస్తాం.

● శివ మల్లేశ్వరప్ప, ఎంపీడీవో, శిరివెళ్ల




శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉన్న పాఠశాల తరగతి గదులు

భావోద్వేగాలను నియంత్రణలో ఉంచుకోవాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మనిషి ఆలోచనల, భావోద్వేగాలు నియంత్రణలో ఉంచుకోగలిగితే మానసికంగా దృఢంగా ఉంటారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి అన్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కర్నూలు మెడికల్ కాలేజీలో సైకియాట్రి విభాగం హెచ్‌వోడీ డా.నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జడ్జి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం, సామాజిక ఆరోగ్యం బాగునప్పుడే వారిని ఆరోగ్యవంతంగా ఉంటారని, వ్యక్తులు తీవ్ర ఒత్తిడికి గురైనప్పుడు స్నేహితులు దగ్గర, బంధువులు వారికి గుర్తించి వారికి కలుపుకుని వెళితే ఆ సమస్య లో నుంచి బయటపడుతారన్నారు. పౌరులకు ఎవరికైనా ఇబ్బందులు ఎదురైనప్పుడు లీగల్ సహాయం కొరకు టోల్ ఫ్రి.నెంబర్.15100ను సంప్రదించాలని కోరారు. సైక్రియాటీ విభాగాధిపతి డా.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎవరికైనా మానసిక ఆరోగ్య సమస్యలకు తమ విభాగం నుంచి 24 గంటలు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డా.కె.చిట్టి నరసమ్మ మాట్లాడుతూ ఎవరికైనా మానసికంగా అపత్కర పరిస్థితి ఏర్పడితే సేవల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 14416ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎండో క్రైనాలజీ హెచ్‌వోడీ డా.పి.శ్రీనివాసులు, లీగల్ సర్వీస్ యూనిట్ మెంబర్ డా.రాయపాటి శ్రీనివాసులు, సైక్రియాత్రి విభాగపు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.గంగాధర్ నాయక్, డా.యతిరాజ్, ఎస్ఆర్‌లు డా.ఉమ్మైద్ సిరాజ్, డా.జయశ్రీ, పీజీలు పాల్గొన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో...

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ర్యాలీని డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక ఆరోగ్యంను నిర్లక్ష్యం చేస్తే సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. ఆరోగ్యకరమైన మనస్సు ఆరోగ్యమైన సమాజానికి మూలమన్నారు. మానసిక ఆరోగ్య సేవలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టీబీ ఆఫీసర్ డాక్టర్ ఎల్.భాస్కర్ ఆర్‌బీఎస్‌కే జిల్లా కో-ఆర్డినేటర్ డా.మహేశ్వర ప్రసాద్, సంచార చికిత్స కార్యక్రమ అధికారి డా.రఘు, మానసిక వైద్యులు డా.చైతన్య పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయండి

కలెక్టర్ రాజకుమారి


మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 16న శ్రీశైల పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రధాన మంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి, అప్పగించిన బాధ్యతలను సమయానికి పూర్తి చేయాలన్నారు. సున్నిపెంటలో ఏర్పాటు చేస్తున్న హెలీప్యాడ్ పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో రామునాయక్, ఆర్డీవో విశ్వనాథ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

మోదీ పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

- ఉత్తర్వులు జారీ చేసిన మున్సిపల్‌శాఖ

అమరావతి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న ప్రధాని మోదీ శ్రీశైలం పర్యటనకు సంబంధించి విస్తృతమైన ఏర్పాట్లుకు రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారులను నియమించింది. పారిశుధ్యం, వీధిలైట్లు, సుందరీకరణ బాధ్యతలను సీడీఎంఏ సంపత్‌కుమార్, స్వచ్ఛాంధ్ర ఎండీ అనిల్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ టి.గాయత్రి, పబ్లిక్ హెల్త్ ఈఎన్‌సీ ప్రభాకర్, ఏపీ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ ఎంకేవీ శ్రీనివాసులకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పారిశుధ్యం, వీధిలైట్లు, సుందరీకరణ బాధ్యతలు నిర్వర్తించేందుకు 18 మున్సిపాలిటీల కమిషనర్లు, 800 మంది శానిటేషన్ సిబ్బంది, 80 మంది సూపర్‌వైజర్లతో పాటు సంబంధిత యంత్రాలు, పరికరాలతో ఈ నెల 14 లోపు కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు రిపోర్టు చేసుకోవాలని మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

యాగంటి హుండీ ఆదాయం రూ.20.46 లక్షలు


యాగంటి ఆలయ హుండీని లెక్కిస్తున్న భక్తులు

బనగానపల్లె, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): యాగంటి క్షేత్రంలో శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ హుండీ లెక్కింపు నిర్వహించారు. ఆలయ హుండీలను 90 రోజులకు గాను హుండీని లెక్కించగా నగదు రూ.20లక్షల 46వేలు లభించినట్లు ఏసీ తెలిపారు. 650 గ్రాముల వెండి లభించినట్లు వెల్లడించారు. ఆలయ తనిఖీ అధికారి హరిశ్చంద్రారెడ్డి, సమక్షంలో బండి మౌళీశ్వరరెడ్డి, రామశేఖర్, భరతుడు, ఆలయ అర్చకులు సత్యనారాయణ, సిబ్బంది, ప్రసాద్ శ్రీరామసేవాసమితి, శ్రీబాలాజీ సేవా సమితి సభ్యులు హుండీని లెక్కించినట్లు తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన మొదటి విడత కౌన్సెలింగ్

- 18న పారా మెడికల్ కోర్సులకు రెండో విడత కౌన్సెలింగ్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అలైడ్ హెల్త్ సైన్సెస్ పారా మెడికల్‌కు సంబంధించిన 10 డిప్లొమా కోర్సులకు మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తి చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ తెలిపారు. మెరిట్ 50 రోస్టర్ ప్రకారం సీట్ల భర్తీ చేసినట్లు తెలిపారు. 18వ తేదీ రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.సాయిసుధీర్, పెథాలజీ హెచ్‌వోడీ డా.బాలేశ్వరి, అసిస్టెంట్ డైరెక్టర్ మల్లేశ్వరి, ఆఫీసు సూపరింటెండెంట్ హరిశంకర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో నంద్యాల వాసి ప్రతిభ


పతకాలు సాధించిన ప్రభాకర్‌రెడ్డి

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో నంద్యాలవాసి కాశీపురం ప్రభాకర్‌రెడ్డి నాలుగు పతకాలు సాధించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా తరపున 50+ కేటగిరీలో ప్రాతినిధ్యం వహించన ప్రభాకర్‌రెడ్డి 25 మీటర్లు, 50 మీటర్లు ఫ్రీ స్టైల్ ఈవెంట్స్‌లో రెండో స్థానంలో నిలిచారు. ప్రభాకర్‌రెడ్డి తాను పాల్గొన్న నాలుగు ఈ వెంట్స్‌లోను పతకాలు సాధించడం విశేషం. నంద్యాలలో ప్రొఫెషనల్ స్విమ్మింగ్ పూల్ లేనప్పటికీ కేసీ కెనాల్‌లో రెగ్యులర్‌గా ప్రాక్టిస్ చేసి ఈ ఘనత సాధించడం మరో విశేషం.

5కే మారథాన్‌లో రెండో స్థానం

- రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించిన లీలా ప్రసాద్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ విజయవాడలో రాష్ట్ర స్థాయి యూత్ ఫెస్ట్ మారథాన్ 5 కిలోమీటర్ల పరుగు పోటీలు నిర్వహించారు. జిల్లాకు చెందిన ట్రాన్స్‌జెండర్ లీలా ప్రసాద్ రాష్ట్ర స్థాయిలో రెండో బహుమతి కైవసం చేసుకున్నారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డా.సుచిత్ర, జాయింట్ డైరెక్టర్ డా.మంజుల చేతుల మీదుగా శుక్రవారం లీలాప్రసాద్‌కు రూ.25వేల నగదు, ప్రశంసాపత్రం, మెమెంటోను అందజేశారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాకు అవార్డు రావడంపై డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ, జిల్లా టీబీ ఆఫీసర్ డా.ఎల్.భాస్కర్, ప్రోగ్రాం ఆఫీసర్ అలిహైదర్ అభినందనలు తెలిపారు.

మోదీ సభ ఏర్పాట్ల పరిశీలన

- పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులు


మోదీ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సమన్వయ కమిటీ

కర్నూలు అర్బన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ బహిరంగ సభ ఏర్పాట్లను టీడీపీ జిల్లా సమన్వయ కమిటీ పరిశీలించింది. శుక్రవారం జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ఆధ్వర్యంలో నన్నూరు టోల్ ప్లాజా సమీపంలోని రాగమయూరి వద్ద పార్కింగ్, హెలి ప్యాడ్, సభా ప్రాంగణం ఏర్పాట్లను పరిశీలించి జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, వసతులు ఏర్పాటు దిశగా అధికారులతో మా సహకారం ఎక్కడైనా అవసరం ఉంటే కోరాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక అధికారులను అక్కడ పర్యవేక్షణకు నియమించాయి. ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు కేఈ శ్యామ్‌బాబు, బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్‌విష్ణువర్ధన్‌రెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ రాజు, ఆలూరు, మంత్రాలయం ఇన్‌చార్జిలు వైకుంఠం జ్యోతి, రాఘవేంద్రరెడ్డి, మీడియా కో-ఆర్డినేటర్ బి.వెంకటరాముడు, సత్రం రామృష్ణుడు, కురువ కార్పొరేషన్ డైరెక్టర్ కురువ రామక్రిష్ణ పాల్గొన్నారు.

ప్రధాని సభకు అన్ని ఏర్పాట్లు: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

ఓర్వకల్లు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16వ తేదీన జరిగే ప్రధానమంత్రి బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ సిరి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ ముందుగా ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి శ్రీశైలం వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటారన్నారు. నన్నూరు టోల్ ప్లాజా వద్ద ఉన్న రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. ఈసభ 40 ఎకరాల్లో 3 లక్షల మంది సమావేశంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేశామన్నారు. 347 ఎకరాల్లో 10వేల బస్సులు నిలుపుకునే విధంగా 12 పార్కింగ్ పాయింట్లు ఏర్పాటు చేశామని వివరించారు. అన్ని పార్కింగ్ పాయింట్లు జాతీయ రహదారికి అనుసంధానం చేసే విదంగా అంతర్గత రహదారుల నిర్మాణం రేపు సాయంత్రానికి పూర్తవుతుందని తెలిపారు. ఈసభకు వచ్చే ప్రజలందరికీ తాగునీరు, మజ్జిగ, భోజనం, అవసరమైన వైద్య సదుపాయాలు, టాయిలెట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

కర్నూలు క్రైం: ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను పీఎం ప్రోగ్రాం స్పెషల్ ఆఫీసర్, సీనియర్ ఐఏఎస్ అధికారి వీరపాండియన్, కలెక్టర్ సిరి, ఐఏఎస్ ప్రసన్న వెంకటేశ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధాని పర్యటన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అన్నమయ్య జిల్లా జేసీ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.


సభా ప్రాంగణం వద్ద జరుగుతున్న పనులు

ప్రకృతి సోయగం.. అహోబిలం


ప్రహ్లాద వరదుని ఆలయంపై దూకుతున్నట్లున్న జలపాతాలు

ఎత్తైన కొండలు.. ఎటుచూసినా పరిఢవిల్లుతున్న పచ్చదనం.. నీటి గలగలలు.. కొండల నుంచి జాలువారుతున్న జల సవ్వడులు.. ప్రతి ఒక్కరినీ తన్మయత్వానికి గురిచేసే ప్రాంతమే ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం. లక్ష్మీనరసింహాస్వామి రక్తసిక్తమైన చేతులు కడగడం కోసం దివి నుంచి భువికి దిగి వచ్చిన భవనాశి నది సోయగం వర్ణనాతీతం. కొండల నుంచి జాలువారుతున్న నది అందాలను చూసి మంత్ర ముగ్ధులు కావాల్సిందే. కొన్ని నెలలుగా ఎండిన జలపాతాలు ఒక్కసారిగా జలకళను సంతరించుకున్నాయి. ఈ రమణీయతను చేసేందుకు పర్యాటకులు అధికంగా తరలివస్తున్నారు.

● ఆళ్లగడ్డ, ఆంధ్రజ్యోతి






అడవి తల్లి ఒడి నుంచి పారుతున్న భవనాశి నది


ఉదయం పూట రెండు కొండల మధ్య స్వామి ఆలయం

పార్క్‌కు వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

- అతివేగంతో బైక్‌ను ఢీకొట్టిన లారీ
- భర్త దుర్మరణం.. భార్య, కొడుకుకు తీవ్రగాయాలు



తిరుపాల్ (ఫైల్)

ఆదోని రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పార్క్‌కు వెళ్లి వస్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్య, కొడుకు తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ ఘటన ఆదోని పట్టణంలో చోటు చేసుకున్నట్లు తాలుకా ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని బీవీఆర్ ఎస్టేట్‌లో తిరుపాల్(45), భార్య సుమలత, కూతురు ప్రజ్వల, కొడుకు విక్రాంత్‌తో కలిసి నివాసం ఉంటున్నారు. ఆయన కౌతాళం ఎల్లెల్సీ సెక్షరులో లస్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం విధులు ముగించుకొని ఇంటికి చేరుకున్నాడు. కొడుకు విక్రాంత్ మారం చేయడంతో కొడుకు, భార్య సుమలతతో కలిసి బైక్‌పై ఆరేకల్లు శివారులోని పార్క్‌కు వెళ్లారు. అక్కడ కాసేపు సరదాగా గడిపారు. చీకటి పడుతున్న తరుణంలో తిరుగు ప్రయాణమయ్యారు. ఆరేకల్లు గురుకల పాఠశాల వద్దకు రాగానే వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. తిరుపాల్‌పై లారీ ఎక్కడంతో శరీరం రెండు ముక్కలై అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయాల పాలైన సుమలత, విక్రాంత్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం ఆదోని ఏరియాసుపత్రికి తరలించారు. వీరిద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- ఇద్దరికి స్వల్పగాయాలు

బేతంచెర్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోర్లగుట్టలో ట్రాక్టర్, మోటారు సైకిల్ ఢీకొన్న ఘటనలో గ్రామానికి చెందిన నరేంద్రనాథ్ రెడ్డి (34) అక్కడికక్కడే మృతి చెందగా.. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలివీ.. శుక్రవారం సాయంత్రం గోర్లగుట్ట గ్రామానికి చెందిన నారాయణరెడ్డి సుభద్రమ్మ దంపతుల కుమారుడు నరేంద్రనాథ్ రెడ్డి తన ఇంటి వద్ద నుంచి పని నిమిత్తం బైక్‌పై వెళ్తుండగా నాపరాయి లోడుతో బేతంచెర్లకు వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడే మృతి చెందాడు. అతడితో పాటు మోటారు సైకిల్‌పై ఉన్న సుబ్బ అనే యవకుడితో పాటు రోడ్డు పక్కన నడుచుకుంటున్న వెళ్తున్న రజనీ అనే బాలికకు గాయాలయ్యాయి. ఇద్దరినీ బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడ ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ అబ్దుల్ నబీ తెలిపారు.

చికిత్స పొందుతూ..

వెల్దుర్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గ్యాస్ లీకైన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ కోలుకోలేక వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇవీ.. మండలంలోని ఎస్.బోయినపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై మంటలు చెలరేగి ఒకే కుటుంబానికి చెందిన బండ నాగరాజు, సువర్ణ, అనిల్, చరణ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ఈ నలుగురు కర్నూలు సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. బండ నాగరాజు శుక్రవారం చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మిగతా ముగ్గురి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం.

శాశ్వత లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం



బాధితురాలికి న్యాయపత్రాలు అందిస్తున్న వెంకట హరినాథ్

కర్నూలు లీగల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): శాశ్వత లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం చేకూరుతుందని చైర్మన్ ఎం.వెంకట హరినాథ్ తెలిపారు. శుక్రవారం శాశ్వత లోక్ అదాలత్‌లో వివాదానికి సంబంధించి ఖర్చు లేకుండా సత్వర న్యాయం చేశామన్నారు. ఫిర్యాది ఎస్.వెంకటలక్ష్మి భర్త అతను బతికి ఉన్నప్పుడు నగరానికి చెందిన ఫైవ్‌స్టార్ ఫైనాన్స్ ప్రైవేటు లిమిటెడ్ నుంచి రూ.6లక్షలు రుణం తీసుకున్నాడు. ఆయన మృతి చెందాక ఫిర్యాది బాకీ మొత్తాన్ని చెల్లించినా కూడా టైటిల్ డీడ్లను కంపెనీవారు తిరిగి ఇవ్వలేదు. దీంతో ఫిర్యాది శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించగా, రాజీమార్గంలో పరిష్కరించి టైటిల్ డీడ్‌ను అందజేశారు. సభ్యులు టి.శివశంకర్ రెడ్డి, డి.రాజుబాబు, న్యాయవాది రాంపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆ ఉపాధ్యాయుడి తప్పేంటి?

- విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపడమా?
- గురువుపై విద్యార్థి తండ్రి దాడి
- తల, ముక్కుకు గాయాలు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయులు



గాయపడ్డ ఉపాధ్యాయుడు బసవరాజు

గోనెగండ్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆ ఉపాధ్యాయుడు చేసిన తప్పేంటి? విద్యార్థి ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేయడమా.. ప్రత్యేక శ్రద్ధ చూపి చదువు చెప్పడమా.. విద్యార్థి పాఠశాలకు రాకపోతే పిల్లలను వారింటికి పంపి వాకబు చేయడమా? ఇదేనా అతను చేసిన తప్పు. దీనికి ప్రతిఫలమేనా కర్రతో దాడి. గురువు అని కూడా చూడకుండా విద్యార్థి తండ్రి కర్రతో దాడి చేసిన ఘటన మండలంలోని గాజుల దిన్నె గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, విద్యా శాఖాధికారులు తెలిపిన వివరాలు.. కర్నూలుకు చెందిన బసవరాజు ఎనిమిదేళ్లుగా గాజులదిన్నె ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అదే కాలనీకి చెందిన మీసాల రంగస్వామి కుమారుడు హర్షవర్ధన్ మానసిక దివ్యాంగుడు. పాఠశాలలో నాలుగో తరగతి చదువుతు న్నాడు. బసవరాజు ఆవిద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యా బోధన చేసేవాడు. కొన్ని రోజులుగా హర్షవర్ధన్ పాఠశాలకు రావడంలేదు. దీంతో ఉపాధ్యాయుడు పాఠశాలకు చెందిన ఇతర పిల్లలను హర్షవర్ధన్ ఇంటికి పంపాడు. దీంతో విద్యార్థి తండ్రి ఆగ్రహంతో ఊగిపోయాడు. శుక్రవారం బసవరాజు పాఠశాలకు వస్తుండగా మీసాల రంగస్వామి కర్రతో దాడి చేశాడు. దీంతో తలకు, ముక్కుకు గాయాలయ్యాయి. ఘటనను గమనించిన కాలనీవాసులు దాడిని అడ్డుకున్నారు. తోటి ఉపాధ్యాయులు, కాలనీవాసులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఎంఈవో రామాంజినేయులు, నీలకంఠ, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ విజయభాస్కర్ విచారణ చేసి మీసాల రంగస్వామిపై దాడి కేసు నమోదు చేశారు.

బదిలీ అయిన చివరి రోజే దాడి..

గాజులదిన్నెలో ఎనిమిదేళ్లుగా పనిచేయడంతో బసవారాజును లాంగ్ స్టాండింగ్ కింద కోడుమూరుకు బదిలీ అయ్యాడు. గాజులదిన్నెలో శుక్రవారం చివరి రోజు విధులు నిర్వహించేందుకు రాగా దాడి జరిగింది. సోమవారం కోడుమూరులో జాయిన్ కావాల్సి ఉంది.

లెక్క తేలని ఆభరణాలు

- 11 ఏళ్లుగా లెక్కలు చూపించని ఈవోలు
- విచారణకు ఆదేశించిన దేవదాయ శాఖ ఉన్నతాధికారులు
- రేపు ఆభరణాల, రికార్డుల తనిఖీలు



నందవరం చౌడేశ్వరీమాత ఆలయం

బనగానపల్లె, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయానికి సంబంధించిన బంగారు బంగారు, వెండి ఆభరణాల లెక్క తేలలేదు. ఆలయ ఈవోలు 11 ఏళ్లుగా లెక్కలు చూపించలేదు. అమ్మవారి బంగారు, వెండి ఆభరణాలు ఉన్నాయా లేదా అన్న మీమాంసలో భక్తులు పడ్డారు. ఈవోలు మారినప్పుడల్లా కొత్తగా వచ్చిన ఈవోలకు నగదు లావాదేవీలతో పాటు బంగారు, వెండి ఆభరణాల రికార్డులు చూపించాలన్న నిబంధన ఉంది. గతంలో పనిచేసిన ఈవోలు లెక్కలు చూపకపోవడంతో దేవదాయశాఖ ఉన్నతాధికారులు విచారణ జరపాలని, గతంలో పనిచేసిన ఈవోలకు నోటీసులు ఇవ్వాలని ఆదేశాలు జారీచేశారు.

హుండీని లెక్కించి..

నందవరంచౌడేశ్వరీమాత ఆలయానికి లక్షలాదిగా భక్తులు వస్తుంటారు. వారు మొక్కులు చెల్లించడానికి కానుకలు హుండీల్లో వేస్తుంటారు. కొందరు అమ్మవారికి బంగారు , వెండి ఆభరణాలను కొందరు నగదును సమర్పిస్తుంటారు. అమ్మవారి హుండీ నగదును, బంగారు, వెండి ఇతర ఆభరణాలను ప్రతి ఏడాది రెండు మూడుసార్లు లెక్కిస్తారు. వీటిలో నగదు బ్యాంకుల్లో జమచేస్తారు. బంగారు, వెండి, ఇతర ఆభరణాలను బ్యాంకు లాకర్లలో భద్ర పరుస్తారు. కొంత బంగారును అమ్మవారికి అలంకరణకు గాను ఆలయ అధికారులు, ఆలయ పూజారుల కస్టడీలో భద్ర పరుస్తారు. హుండీలను ఆలయ ఈవోలు, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్లు, ఉన్నతాధికారులు, భక్తుల పర్యవేక్షణతో లెక్కిస్తారు. భక్తులు సమర్పించిన కానుకలు ఇతరత్రా వచ్చే ఆదాయంలోనే ఆలయ సిబ్బందికి, పూజారులకు, ప్రసాదాలకు, అభివృద్ధికి, నిర్వహణకు ఖర్చు చేస్తుంటారు.

ప్రస్తుత ఈవో ఫిర్యాదుతో..

చౌడేశ్వరీమాత అమ్మవారికి సమర్పించిన బంగారు ఆభరణాలను, ఆభరణాల వివరాలను, రికార్డులను గతంలో పనిచేసిన ఈవో నూతనంగా వచ్చిన ఈవో నల్లకాల్వ శ్రీనివాసులురెడ్డికి అప్పగించలేదు. దీంతో ఆయన దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు ఈవిషయమై ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు నందవరం ఆలయ ఆభరణాల వివరాలు తేల్చాలని జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి పాండురంగారెడ్డికి ఆదేశాలు జారీచేశారు. ఈమేరకు పాండురంగారెడ్డి గతంలో పనిచేసిన ఈవోలు రామానుజన్, కామేశ్వరికి నోటీసులు జారీచేశారు. ఈనెల 12న నందవరం శ్రీచౌడేశ్వరీ ఆలయంలో బంగారు, వెండి ఆభరణాలకు సంబంధించి వెరిఫికేషన్, రికార్డులను తనిఖీ చేయనున్నారు.

బంగారు ఆభరణం మాయం?



చౌడేశ్వరీ అమ్మవారు ధరించే ఓ బంగారు ఆభరణం మాయమైనట్లు ఆరోపణలున్నాయి. ఈ ఆభరణం ఎక్కడ మాయమైందో తేల్చే పనిలో దేవదాయశాఖ అధికారులు విచారణ సాగిస్తున్నారు. గతంలో ఓ భక్తురాలు ఈఆభరణాన్ని అమ్మవారికి సమర్పించినట్లు తెలుస్తోంది. ఆబంగారు ఆభరణం హుండీ లెక్కింపుల్లోనూ, అమ్మవారి మెడలోనూ లేక పోవడం, గతంలో పనిచేసిన ఈవోలు ఆభరణాల వివరాలు లెక్క చూపకపోవడంతో ఆ భక్తురాలు జిల్లా దేవాదాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేసింది. తాను సమర్పించిన ఆభరణం కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. దీంతో ఈ విషయమై లోతైన విచారణ జరపాలని దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. ఈ విషయం నిగ్గు తేల్చేందుకు ఈనెల 12న విచారణకు రావాలని ఈవోలు రామానుజన్, కావేశ్వరికి ఆభరణాల తనిఖీ అధికారి పాండురంగారెడ్డి నోటీసులు జారీ చేశారు.

బట్టమేక పక్షి తిరిగి వచ్చేలా ఏర్పాటు చేద్దాం

- నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



మాట్లాడుతున్న నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

మిడుతూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బట్టమేక పక్షి తిరిగి రోళ్లపాడు అభయారణ్యంలోకి వచ్చేలా ఏర్పాటు చేద్దాం అని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం మిడుతూరు మండలంబ రోళ్లపాడు అభయారణ్యం గెస్టుహౌస్ ఆవరణంలో సొసైటీ బస్టర్డు రికవరీ ప్రోగ్రామ్ అనే కార్యక్రమం వ్యవస్థాపకుడు మాండ్ర లింగా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాండ్ర లింగారెడ్డి మాట్లాడుతూ రోళ్లపాడు అరణ్యంలో కనుమరగైన బట్టమేక పక్షిని తిరిగి రప్పించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొంది స్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పక్షికి ఇక్కడ అనుకూలమైన గడ్డి మైదానం ఉండడం వల్ల 1986లో రోళ్లపాడు అభయారణ్యంలో బట్టమేక సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బట్టమేక పక్షులు రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలలో 150 మాత్రమే ఉన్నాయని, ఇప్పుడు ఇక్కడికి వచ్చి పోతున్నాయన్నారు. ప్రస్తుతం వాతావరణ కాలుష్యం, సోలార్, హైటెన్షన్ విద్యుత్ వైర్లు తదితర కారణాల వల్ల బట్టమేక పక్షులు ఇక్కడికి రావడం లేదన్నారు. కావున బట్టమేక పక్షులు మళ్లీ ఇక్కడికి వచ్చే విధంగా బస్టర్డు రికవరీ ప్రోగ్రామ్ ఏర్పాటు చేసినట్లు మాండ్ర లింగారెడ్డి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ రోళ్లపాడు అభయారణ్యంలో బట్టమేక పక్షి సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం మన అదృష్టమన్నారు. ప్రపంచంలోనే పేరుగాంచిన ఈ పక్షిని కాపాడు కోవడం మనందరి బాధ్యత అన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకుపోయి రోళ్లపాడు అభయ అరణ్యంను అభివృద్ధి చేద్దామన్నారు. అనంతరం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ బట్టమేక పక్షికి ప్రసిద్ధిగాంచిన ప్రదేశం రోళ్లపాడు కావడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బాంబే బర్డు సైటిస్టు డాక్టర్ సుజిత్ నర్వాడే, మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద రెడ్డి, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, కడియం వెంకటేశ్వర్లు యాదవ్, రామస్వామి రెడ్డి, సర్వోత్తమ రెడ్డి, వెంకటరామి రెడ్డి రవీంద్రబాబు, రైతులు పాల్గొన్నారు.

డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్య సేవలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డా.ఎన్‌టీఆర్ వైద్య సేవల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కో ఆర్డినేటర్ డా.రూపేంద్రనాథరెడ్డి తెలిపారు. జిల్లాలో 25 ఆస్పత్రులలో డా.ఎన్‌టీఆర్ వైద్యసేవలు ఉన్నాయని, ప్రస్తుతం ఆ ఆస్పత్రుల్లో సేవలు నిలిపివేశారన్నారు. కాగా జిల్లాలో ఆళ్లగడ్డలో ఉన్న స్వాంతన ఆస్పత్రి, నంద్యాలలో శాంతిరాం ఆస్పత్రి, మధు చిన్న పిల్లల ఆస్పత్రుల్లో డా.ఎన్‌టీఆర్ వైద్యసేవలు కొనసాగిస్తున్నారన్నారు. మిగతా ఆస్పత్రుల్లో వైద్యసేవలు లేకపోవడంతో 104వాహనాలను అందుబాటులో ఉంచి రోగుల కోరికమేరకు జీజీహెచ్, శాంతిరాం ఆస్పత్రులకు తరలిస్తున్నామన్నారు. నంద్యాలలో 19, ఆత్మకూరులో 2, డోన్‌లో 3, ఆళ్లగడ్డలో 1ఆస్పత్రుల్లో డా.ఎన్‌టీఆర్ వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. డోన్ ప్రాంత రోగులకు అందుబాటులో 104వాహనం ఏర్పాటు చేశామన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పాణ్యం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొగర్చేడు గ్రామం కుందూ వంతెన వద్ద శుక్రవారం రాత్రి గుర్తు తెలియని మగ మృతదేహాన్ని గుర్తించినట్లు పాణ్యం ఎస్‌ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. మృతునికి 35 నుంచి 45 యేళ్ల వయసు ఉంటుందన్నారు. కుందూ నీటిలో మూడు రోజుల క్రితం పడి మరణించి ఉండవచ్చని పేర్కొన్నారు.. మృతదేహం ఎత్తు 5. 5 అడుగులు ఉందన్నారు. శరీరంపై నీలం రంగు ఆఫ్ షర్ట్, తెల్లని కట్ బనియన్, దానిపై లక్స్ అని ఎర్ర అక్షరములు, దానికింద వీనస్ అన్న నీలం రంగు అక్షరాలు ఉన్నాయన్నారు. నలుపు రంగు ప్యాంటు, నీలం రంగు కట్ డ్రాయర్, దానిపై నవీన్ అన్న అక్షరాలు ఉన్నాయన్నారు. సమాచారం తెలిసిన వారు పాణ్యం ఎస్‌ఐ నెంబరు 9121101096 కు అందజేయాలని కోరారు.

అనుమతుల్లేని బాణసంచా పట్టివేత



బాణసంచా చూపుతున్న సీఐ

నంద్యాల టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిత్తలూరివారి వీధిలో అనుమతులు లేకుండా బాణసంచా నిల్వలు శుక్రవారం పట్టుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. అనుమతులేకుండా నిల్వలు ఉన్నాయన్న సమాచారం మేరకు దాడులు చేసి సుమారుగా రూ.30 వేలు విలు చేసే వస్తువులను పట్టుకున్నట్లు చెప్పారు. ఈ దుకాణాన్ని కృష్ణమోహన్‌అనే వ్యక్తి నడుతున్నట్లు తెలిపారు. ఆయనపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అదే విధంగా రానున్న దీపావళికి అనుమతులు లేకుండా బాణసంచా నిల్వలు ఉంచరాదన్నారు.

చిట్టీల వ్యాపారిపై కేసు నమోదు

కర్నూలు క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో న్యూకృష్ణానగర్ చెందిన చిట్టీల వ్యాపారి కృష్ణకుమార్ అనే వ్యక్తి మోసం చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కృష్ణకుమార్ చిట్టీల వ్యాపారం నిర్వహిస్తుంటున్నారు. ఇదే కృష్ణానగర్‌కు చెందిన నిరంజన్ కుమార్ రూ.42 లక్షల మేర చిట్టీల కంతులు చెల్లించారు. దీంతో పాటు మరో కొంత నగదును కృష్ణకుమర్ అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న మొత్తం తిరిగి చెల్లించకపోగా, చిట్టీ కంతులు తిరిగి వెనక్కు ఇవ్వకపోవడంతో పలుసార్లు నిలదీశాడు. కొద్ది కాలంగా తప్పించుకుని తిరుగుతుండటంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైసీపీకి పునాదులు కార్యకర్తలే

- రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- వైసీపీ నంద్యాల జిల్లా స్థాయి సమావేశం



మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

నంద్యాల రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వైసీపీకి బలమైన పునాదులు కార్యకర్తలేనని వైసీపీ రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల లోని ఆర్‌కే పంక్షన్ హాల్లో జిల్లా స్థాయి సంస్థాగత సమావేశం జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు జిల్లాలోని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, పార్లమెంట్ పరిశీలకురాలు ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి పాల్గొన్నారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు వివిధ విభాగాల్లో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. కమిటీల ఏర్పాటుతో కార్యకర్తలకు గుర్తింపు లభిస్తుందన్నారు. నవంబరు 24 నుంచి రచ్చబండ కార్యక్రమం నిర్వహించి కోటి సంతకాల సేకరణ చేసి గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్, గంగుల బిజేంద్రనాథ్ రెడ్డి, నాయకులు చల్లా మధుసూన్‌రెడ్డి, భూమా కిషోర్‌రెడ్డి, పెద్ద ఎత్తున కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.5

పత్తికొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం టమోటా కిలో రూ.5కు పడిపోయింది. 10 కిలోల జత గంపలు వ్యాపారులు రూ.100 నుంచి రూ.150 వరకు కొనుగోలు చేశారు. అయితే ఉన్నతాధికారులు మార్కెట్‌కు వచ్చిన సమయంలో ధరలు ఎక్కువగా పలుకుతున్నాయని వారు వెళ్లిపోగానే ధరలను తగ్గించేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. నాణ్యతను బట్టి టమోటా కొనుగోళ్లు జరుగుతున్నాయని మార్కెట్ యార్డు ప్రత్యేక కార్యదర్శి పద్మావతి తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు మొత్తం 60.81 టన్నుల టమోటా వచ్చింది. కనిష్ఠంగా క్వింటా రూ.500, సగటున రూ.1,200, గరిష్ఠంగా రూ.1,700 చొప్పున కొనుగోళ్లు జరిగాయి.



పత్తికొండ మార్కెట్‌కు వచ్చిన టమోటా

పత్తి కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్

- ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని జేసీ నవ్య ఆదేశం



కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే పత్తి పంట సాగులో మొదటి స్థానంలో ఉన్న కర్నూలు జిల్లా రైతులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ ఇచ్చింది. ప్రభుత్వ ఆదేశాలతో జేసీ డా.నవ్య శుక్రవారం మార్కెటింగ్ శాఖ అధికారులు, సీసీఐ అధికారులతో తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు సీసీఐ అధికారులు వెంటనే రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను ఎటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా జరపాలని, ఈ విషయంలో మార్కెటింగ్ శాఖ అధికారులు, సీసీఐ అధికారులతో సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని కొనసాగించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఖరీఫ్‌లో సాగైన పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేసేందుకు జిల్లాలో అవసరమైన చోట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని జేసీ ఆదేశించారు. ప్రభుత్వం క్వింటం పత్తికి మద్దతు ధరను రూ.8,060గా నిర్ణయించిందని, నాణ్యతను బట్టి ప్రతి క్వింటానికి ఈ ధర రైతుకు అందించాలని స్పష్టం చేశారు. పొడవు రకం పత్తికి ఈ ధర అందించాలన్నారు. పత్తిని విక్రయించే రైతులు ఆదోని మార్కెట్ కమిటీ 9182361164, ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ 9182361166, మంత్రాలయం మార్కెట్ కమిటీ 8328682823, కోడుమూరు 9705556596 నెంబర్లను సంప్రదించి సమాచారాన్ని మార్కెట్ కమిటీల సెక్రటరీలు అందించే విదంగా మార్కెటింగ్ శాఖ ఏడీఎం చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పొట్టకొడుతున్న ఏజెన్సీలు

- 13న కలెక్టర్‌కు వినతి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పొట్టకొడుతున్నాయని ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప అన్నారు. శుక్రవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.ప్రణీత్, జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, ఏఐటీవైసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ హాస్పిటల్‌లో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులకు జీవో.నెంబర్.138 ప్రకారం కనీస వేతనం రూ.18,600లు సూపర్‌వైజర్లకు రూ.21వేలు వేతనం అమలు చేయాలని పీఎఫ్, ఈఎస్‌ఐతో పాటు వారాంతపు సెలవులు, అర్జిత సెలవులు జాతీయ పండుగ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13న అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాలకు వినతి పత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. సెక్యూరిటీ గార్డుల యూనియన్ అధ్యక్షుడు తిక్కన్న, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీరాములు, విక్రమ్, జయమ్మ, బాలు పాల్గొన్నారు.

మంత్రాలయంలో మద్యం స్వాధీనం

మంత్రాలయం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం లోని రామచంద్ర నగర్ కు చెందిన ఈడిగ జయరాముడు భార్య ఈడిగ శారద అనే మహిళ అక్రమంగా తన ఇంటిలో అమ్ముతుండగా ఎస్‌ఐ శివాంజల్ దాడులుచేసి పట్టుకున్నారు. శక్రవారం రాత్రి వివిధ రకాల మద్యం 29 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని అరెస్టుచేశారు. మంత్రాలయం పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం విక్రయించినా, సరఫరా చేసినా, బహిరంగా ప్రదేశాల్లో మద్యం సేవించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం



నగరపాలక సంస్థ పరిధిలోని 28వ వార్డు లక్ష్మీపురం రహదారి అధ్వానంగా ఉంది. ఎన్‌హెచ్-44 నుంచి గ్రామానికి వెళ్లే రహదారి 2 కి.మీ.ల మేర గుంతలు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రిళ్లు ప్రమాదాలకు గురవుతున్నారు. 2020-21లో కార్పొరేషన్‌లో విలీనమైనా అధికారులు అభివృద్ధి చేయడం లేదని ఇప్పటికైనా స్పందించి నూతన రోడ్డువేయాలని కోరుతున్నారు. **- కల్లూరు**



మొక్కలను నాటి, పర్యావరణాన్ని కాపాడాలని ప్రభుత్వం, అధికారులు, పర్యావరణ వేత్తలు చెబుతున్నా అవేవీ పట్టడం లేదు. శుక్రవారం నగరంలోని 49వ వార్డులోని ఎన్.ఆర్.పేటలోని ఓ ఆసుపత్రి వద్ద వృక్షాన్ని నరికేశారు. కార్పొరేషన్ సమీపంలోనే కూల్చివేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అయితే రోడ్డుకు అడ్డంగ లేకున్నా నరికివేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. **- కర్నూలు న్యూసిటీ**

ఐద్వా మహాసభలను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13,14,15 తేదీల్లో అనంతపురంలో నిర్వహించనున్న ఐద్వా 16వ మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల పిలుపునిచ్చారు. శుక్రవారం ఇందిరాగాంధీనగర్‌లో రేవతి అధ్యక్షతన జెండాను ఆవిష్కరించారు. పద్మావతి, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

రక్త నమూనాల సేకరణ


శాంపిల్స్ సేకరిస్తున్న వైద్యసిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోడుమూరు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లపరి గ్రామం బీసీ కాలనీలో అధికారులు శుక్రవారం రక్తనమూనాలను సేకరించారు. 'ఆంధ్రజ్యోతి దినప్రతికలో 'మురుగు చెంత బతుకు చింత' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ రాఘవయ్య, హెల్త్ అసిస్టెంట్ రాజారావు కాలనీలో పర్యటించి సిబ్బందిచే దోమల నివారణకు అబెట్ మందును, మురుగునీటిలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. కాచివడబోసిన నీటిని తాగాలని సూచించారు. స్పందించిన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

వికసిత్ ఏపీ లక్ష్య సాధనకు ప్రధాని కృషి

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బి.వినూషా రెడ్డి



కర్నూలు హస్పిటల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు ప్రధాన మంత్రి మోదీ కృషి చేస్తున్నారనీ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.బి.వినూషారెడ్డి అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ 16న ప్రదాని శ్రీశైలం వెళ్లి అనంతరం కర్నూలు ప్రజా సభలో పాల్గొంటారన్నారు. ఓర్వకల్లు నోడ్‌ను బెంగుళూరు-చెన్నై ఎకనామిక్ కారిడార్ కింద పరిశ్రమల హబ్‌గా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఆసియాలోనే అతిపెద్ద హైబ్రిడ్ సౌర-గాలి హైడ్రో ఎనర్జీ ప్రాజెక్టు విజయవంతంగా కొనసాగుతోందని అలాగే జయరాజ్ ఇస్పాత్ స్టీల్ ఫ్యాక్టరీ ఉత్పత్తి పనులు ప్రారంభించి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారన్నారు. కర్నూలు కార్పొరేషన్‌కు రూ.300 కోట్ల విలువైన ప్రాజెక్టులు వచ్చాయన్నాయన్నారు. సీపీఐ నాయకుడు రామకృష్ణ 'మోదీ గో బ్యాక్' ర్యాలీ చేస్తానని చెప్పడం సరికాదన్నారు. ప్రజలు కమ్యూనిస్టులకు గోబ్యాక్ చూపించారనీ, వారికి కేరళలో మాత్రమే రాజకీయాలు మిగిలాయన్నారు.

మోదీ పర్యటన దేని కోసం?

● సీపీఎం కార్యదర్శివర్గసభ్యుడు కే.ప్రభాకర్‌రెడ్డి


మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): హామీలు నెరవేర్చని ప్రధానమంత్రి మోదీ కర్నూలుకు దేనికొసం వస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు కే.ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం సుందరయ్య భవన్‌లో జిల్లా కార్యదర్శివర్గసభ్యులు పీఎస్.రాధాక్రిష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 11 ఏళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు ఏ హామీలను కూడా అమలు చేయలేదన్నారు. విభజన హామీలు, ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు, రాయలసీమకు నిధుల ఊసే లేదన్నారు. పాల డబ్బా నుంచి జీఎస్టీ పేరుతో పీల్చి పిప్పి చేసి నేడు తగ్గించామంటూ సభలు పెట్టడం ఎవరిని మోసం చేయడానికన్నారు. ఓర్వకల్లు ప్రాంతంలో పదేళ్లక్రితమే 30 వేల ఎకరాల భూమిని తీసుకున్నారని, ఇప్పటికైనా ఉపాధినిచ్చే పరిశ్రమలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నిర్మల, ఆనంద్‌బాబు, జి.రామక్రిష్ణ, వెంకటేశ్వర్లు, టి.రాముడు, ఎండి.అంజిబాబు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలి

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను క్రీడలతో ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్నదే స్కూల్ గేమ్స్ లక్ష్యమని ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో అండర్-19 స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్, త్రోబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. సెక్రటరీ రాఘవేంద్ర పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రామాంజనేయులు

పీఎం సభను విజయవంతం చేద్దాం

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మోదీ సభను విజయవంతం చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ నన్నూరు గ్రామ సమీపాన రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేశామని, మండలం నుంచి 50వేల మందిని హాజరయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కన్వీనర్ గోవిందరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సీఎన్ సుధాకర్ రెడ్డి, సుధాకర్ రావు, విశ్వేశ్వరరెడ్డి, చంద్రపెద్దస్వామి పాల్గొన్నారు.

● పొదుపు మహిళలతో మాట్లాడుతూ మహిళా శక్తిగా తరలిరావాలని కోరారు. గౌరవ సలహాదారాలు విజయభారతి అధ్యక్షత వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు, విశ్వేశ్వరరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, రాంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు. వ్యవసాయ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే శనగ విత్తనాలను ఏవో మధుమతి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. గోవిందరెడ్డి, సుధాకర్‌రావు, సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు, కాటినేని నారాయణ, పాల్గొన్నారు.

కల్లూరు: 16న నన్నూరులో నిర్వహించనున్న ప్రధానీ మోదీ బహిరంగసభను విజయవంతం చేద్దామని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో జి.నాగశేషాచలరెడ్డి, ఏపీఎం పుష్పావతి, సంఘం అధ్యక్షురాలు జుబేదాబీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పొదుపు మహిళలు, ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

హంద్రీ నదిని కాపాడండి


హంద్రీ నదిలో వ్యర్థాలను పరిశీలిస్తున్న నాయకులు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రవహిస్తున్న హంద్రీ నదిని కాపాడాలని రాయలసీమ యూనివర్సిటీ పూర్వ అధ్యాపకురాలు పి.ఇంద్రాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కిసాన్ ఘాట్ నుంచి కల్లూరు హంద్రీ వంతెన వరకు నదిని పరిశీలించారు. మురుగు చేరకుండా, వ్యర్థపదార్థాలు వేయకుండ చర్యలు తీసుకోవాలన్నారు. హంద్రీ నదిని కబ్జాల నుంచి కాపాడాలన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని నది కుచించుకుపోకుండా చర్యలు తీసుకుని సుందరీకరించాలని డిమాండ్ చేశారు. సభ్యులు ఈ.పుల్లారెడ్డి, నాయకులు సి.రాము, వై.రామాంజనేయులు, వెంకటపతి, యూనుస్, ధీరజ్ పాల్గొన్నారు.

12వ పీఆర్‌సీ నియమించాలి


ఆర్థిక మంత్రి కేశవ్‌తో నాగరాజు

కర్నూలు హస్పిటల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్‌సీని నియమంచాలని తెలుగునాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు కోరారు. శుక్రవారం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను విజయవాడ క్యాంపు ఆఫీసులో కలిసి వినతి పత్రం అందజేశారు. ఉద్యోగుల ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని కోరారు. స్పందించిన మంత్రి ఇందేరే సీఎం కూడా సానుకూలంగా ఉన్నారనీ, విడతల వారీగా అందజేస్తామని హామీ ఇచ్చారు.

అడ్మిషన్ ఇవ్వకుంటే కేసులు నమోదు చేయాలి

కర్నూలు అర్బన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వని బీఈడి కళాశాలలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్‌యూ వీసీ ప్రొఫెసర్ వి. వెంకట బసవరావుకును వినతి పత్రం సమర్పించారు. కొన్ని కళాశాలల యాజమాన్యాలు కన్వీనర్ కోటా సీట్లను రూ.50 వేల నుంచి రూ.80వేల వరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నాయని ఆరోపించారు. నిబంధల ప్రకారం వసతులు, సౌకర్యాలు లేక పోయినా ఎలా అనుమతులు ఇస్తున్నారని ప్రశ్నించారు. నిబంధలనకు విరుద్ధంగా ఉన్న 25 కళాశాలల గుర్తింపులనురద్దు చేయాలని కోరారు. నాయకులు రమణ, సందీప్, ప్రశాంత్, ప్రమోద్ పాల్గొన్నారు.


వీసీకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

శనగ విత్తనాల మంజూరు

గూడూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలానికి 150 క్వింటాళ్ళ సబ్సిడీ శనగ విత్తనాలు మంజూరు అయినట్లు ఏవో దస్తగిరి రెడ్డి తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ రైతులు సమీప రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలన్నారు. పూర్తి ధర క్వింటం రూ.7,800లు కాగా, సబ్సిడీ రూ.1,950లు పోను రైతులు రూ.5,850లు చెల్లించాలన్నారు. ఎకరాకు 40 కేజీల ప్రకారం అందిస్తామన్నారు. ఐదు ఎకరాలు ఉన్న రైతుకు గరిష్టంగా రెండు క్వింటాళ్ళు పంపిణీ చేస్తామని రైతులు వినియోగిచుకవాలని సూచించారు.

మానసిక సమస్యలకు చికిత్స చేయించుకోవాలి


డా.బి.రమేష్‌బాబు

కర్నూలు హస్పిటల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మానసిక సమస్యలను గుర్తించి చికిత్స చేయించుకోవాలని డా.బి.రమేష్‌బాబు అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఎన్‌ఆర్‌పేట మానస క్లీనిక్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. కొందరు మానసిక సమస్యలను చెప్పడానికి, వైద్యులను సంప్రదించడానికి సిగ్గు పడతారని ఇది సరికాదన్నారు. ప్రకృతి వరదలు, భూకంపాలు, సునామీ యుద్ధా వల్ల వచ్చే మానసిక రుగ్మతలను రమేష్‌బాబు వివరించారు.

నేడు విద్యుత్ అంతరాయం

గూడూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సబ్ స్టేషన్ పరిధిలో మరమతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ డి.శ్రీనివాస నాయక్ తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమతుల కారణంగా 33 కేవీ గూడూరు ఫీడర్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినాయోగదారులు సహకరింయాలని కోరారు. వ్యవసాయ ఫీడర్లకు ఉదయం 5 గంటల నుంచి 3ఫేస్ విద్యుత్ సరఫరా ఉంటుందని రైతులు గమనించాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● కోడుమూరు ఎమ్మెల్యే ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కర్నూలు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శుక్రవారం పసుపుల గ్రామంలోని స్వగృహంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ గ్రామాల ప్రజలు సమస్యలను ఎమ్మెల్యేకు తెలియ జేశారు. సంబంధిత అధికారులు పరిష్కరించాలని సూచించారు.


అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

జీవో విడుదల చేయాలి


ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరుతో జీవో విడుదల చేయాలని రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు బిర్రు ప్రతాపరెడ్డి, రాష్ట్ర సంఘటన కార్యదర్శి తూముకుంట ప్రతాపరెడ్డి కోరారు. శుక్రవారం నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి వినతిపత్రం అందజేశారు. విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెడుతున్నట్లు గతంలోనే ప్రకటించినా అధికారికంగా జీవో విడుదల చేయలేదన్నారు. కర్నూలుకు వస్తున్న పీఎం మోదీకి వివరించి పరిష్కరించాలని వారు ఎంపీని కోరారు.

సత్సంబంధాలు ఉండాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకట రెడ్డి

కర్నూలు అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మన చుట్టు ఉన్న వారితో సత్సంబంధాలను కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ కె.వెంకట రెడ్డి సూచించారు. శుక్రవారం కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. సెల్ ఫోన్ వినియోగం తగ్గించి మానవ సంబంధాలను పెంపొందించుకోవాల న్నారు. ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ హారతి చక్ర మాట్లాడుతూ మానసిక ఆరోగ్యంతోనే విజయాలు సాధించవచ్చని తెలిపారు. సైకాలజీ విభాగ అధిపతి జి. విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి కూల ఆలోచనలు కలుపు మొక్కల్లాంటివని వాటిని వెంటనే మనసులో నుంచి తొలగించోలన్నారు. అధ్యాపకులు రూన్సీ, నిఖిల, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలుగా రండి

● ఉషూ క్రీడాకారులకు వీడ్కోలు


రైల్వేస్టేషన్‌లో తైక్వాండో క్రీడాకారులతో కార్యదర్శి కృష్ణ

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉషూ క్రీడాకారులు విజేతలుగా రావాలని కార్యదర్శి టి.కృష్ణ కోరారు. ఈ నెల 11 నుంచి 12వ తేదీ వరకు రాజమండ్రిలో జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఉషూ పోటీలకు క్రీడాకారులకు శుక్రవారం కర్నూలు రైల్వే స్టేషన్‌లో వీడ్కోలు పలికారు. స్కూల్ గేమ్స్ మహిళా కార్యదర్శి టి. నాగేశ్వరి, నిర్వహక కార్యదర్శులు సురేష్‌గౌడ్ కిరణ్‌కుమార్, డా.మల్లికార్జున, మేనేజర్ జిల్లా శ్రీనివాసులు, గీతాంజలి, సుప్రియ పాల్గొన్నారు.

ప్రతిభ చాటండి..

ఈ నెల 11, 12 తేదీల్లో బాపట్లలో నిర్వహించే రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-14 తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటాలని కార్యదర్శి టి.కృష్ణ తెలిపారు. తైక్వాండో మార్షల్స్ విజేతలుగా రావాలని ఆకాంక్షించారు. కర్నూలు రైల్వేస్టేషన్‌లో జట్టుకు వీడ్కోలు తెలిపారు. కోచ్ సురేంద్ర, పీఈటీలు సురేష్, నాగరాజు పాల్గొన్నారు

ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

కర్నూలు క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పీఎం మోదీ జిల్లా పర్యటన సందర్భంగా ఎమ్మెల్యేలు, నాయకులు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో చర్చించారు. శుక్రవారం కార్యాలయంలో ఎస్పీని కలిసి సమీక్షించారు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, ఇన్‌చార్జిలు రాఘవేంద్ర రెడ్డి, వైకుంఠం జ్యోతి, డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, రామచంద్రుడు ఉన్నారు.

జూదరుల అరెస్టు

కర్నూలు క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామంలో ఇద్దరు పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఇద్దరు గ్రామ శివారులో పేకాట ఆడుతుండగా అదుపులోకి తీసుకున్నారు. రూ.55వేల నగదును స్వాదీనం చేసుకుని, . నిందితులపై కేసు నమోదు చేశామని తాలూకా పోలీసులు తెలిపారు.

వాహనాల తనిఖీ

కర్నూలు క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రధాని పర్యటన నేపథ్యంలో నగరంలోని పోలీసులు ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుత్తి పెట్రోల్ బంకువద్ద శుక్రవారం రాత్రి ఎస్ఐ గోపినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు తనిఖీ చేశారు.

ఉపాధ్యాయుడిపై దాడి అమానుషం

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలలో ఉపాధ్యాయుడు జీసీ బసవరాజుపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి దాడిచేయడాన్ని పీఆర్‌టీయూ, ఆప్టా సంఘాలు వేరువేరు ప్రకటనలో ఖండించారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని, మున్ముందు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌వీ కృష్ణారెడ్డి, రామకృష్ణ, ఆప్టా నాయకులు, అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సేవాలాల్ నాయక్ కోరారు.

విభిన్న ప్రతిభావంతులకు పండ్లు పంపిణీ

కర్నూలు కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, బి. లీలా వెంకట శేషాద్రి పండ్లు పంపిణీ చేశారు. అనారోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. హెచ్‌వోడీ డాక్టర్ నాగేశ్వరరావు, సైకాలజిస్టు డాక్టర్ గంగాధర్, లీగల్ సర్వీసెస్ యూనిట్ సభ్యుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.


పండ్లు పంపిణీ చేస్తున్న లీలా వెంకట శేషాద్రి

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


పోస్టరును విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎస్వీ మోహన్ రెడ్డి కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని లక్ష్మి ఫంక్షన్ హాలులో వైసీపీ పార్టీ సంస్థాగత సమావేశం నిర్వహించారు. రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, ఎమ్మెల్యే విరుపాక్షి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, నగర మేయర్ బీవై రామయ్య పాల్గొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను విడుదల చేశారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ



టీడీపీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేస్తున్న బొజ్జమ్మ

దేవనకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద వాల్మీకి చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ టీడీపీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. మండలంలోని 26 గ్రామపంచాయతీలకు గాను 6 వేల మంది టీడీపీ సభ్యత్వం తీసుకోవడంతో, పార్టీ కార్యాలయం నుంచి కార్డులు రావడంతో ఆయా గ్రామాలకు చెందిన నాయకులకు పంపిణీ చేశారు. మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, రామారావునాయుడు, ఉచ్చీరప్ప, మల్లికార్జునగౌడ్, ఆకుల వీరేష్, భాస్కర్, చిన్నవెంకప్ప, ఉమేష్‌గౌడ్, రంగడు, శాంతికుమార్ ఉన్నారు.

'షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా చూడాలి'

ఆదోని టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : షోకాజ్ నోటీసులు జారీ చేయకుండా చూడాలని సచివాలయ కోరారు. పింఛన్లను సకాలంలో పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం వహించిన సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులను జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో సచివాలయ సిబ్బంది శుక్రవారం మునిసిపల్ కమిషనర్ కృష్ణను కలిసి విన్నవించారు. వలంటీర్లు చేయాల్సిన పనిని తాము చేయడానికి ఇబ్బందిగా ఉందని, సమన్వయ లోపం కారణంగా పింఛన్‌ల పంపిణీ కొంత ఆలస్యం జరిగిందని అన్నారు. నోటీసుల జారీ ప్రభుత్వం చేతిలో ఉందని కలెక్టర్ నుండి ఇంకా ఆదేశాలు రాలేదని కమిషనర్ తెలిపారు.

మనేకుర్తి గ్రామంలో చోరీ

● ఓ ఇంట్లో 6 తులాల బంగారం, 10 తులాల వెండి చోరీ

ఆలూరు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మనేకుర్తి గ్రామంలో జాతీయ రహదారి పక్కన నివాసముంటున్న పెద్దలింగయ్య ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో 6 తులాలు బంగారు ఆభరణాలు, 10 తులాలు వెండి చోరీకి గురైనట్లు శుక్రవారం బాధితురాలు లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం తన భర్త లింగయ్య ఊరికి పనిమీద వెళ్లొస్తానని చెప్పి వెళ్లాడని చెప్పారు. ఉన్న ఊరిలో బంధువులు చనిపోగా అక్కడికి తాను వెళ్లినట్లు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు, ఇంట్లో బీరువా పగలగొట్టి బంగారం, వెండి చోరీకి గురైందని తెలిపారు. ఘటనా స్థలానికి ఏఎస్ఐ చంద్రశేఖర్ చేరుకుని విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఒత్తిడితోనే మానసిక సమస్యలు

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఒత్తిడితోనే మానసిక సమస్యలు తలెత్తుతాయని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ చైతన్య కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని నోబుల్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రిన్సిపల్ అబ్దుల్ భాష ఆధ్వక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సైక్రియాటిస్టులు వెంకటసుబ్బయ్య, పుల్లంరాజు, అధ్యాపకులు దివాకర్ సౌజన్య, స్రవంతి, ప్రీతి, సోనీ, విరుపాక్షి, డాక్టర్ సలోమి, ప్రవీణ్ కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలు సామాన్యుల కోసమే

●ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సామాన్యుల సంక్షేమం కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జీఎస్టీ సంస్కరణలను తీసుకొని రావడం జరిగిందని ఎమ్మెల్యే డా. పార్థసారథి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్లో పట్టణంలోని ఆడిటర్లు, ఎలక్ట్రానిక్ వస్తువుల డీలర్లతో వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిత్యం ఉపయోగపడే అనేక వస్తువులపై జీఎస్టీలో భారీ తగ్గింపును తీసుకొని రావడంతో సామాన్య కుటుంబాల వారు ఆర్థికంగా లాభపడుతున్నారని అన్నారు. మోదీ తీసుకున్న ఈ చర్యతో సామాన్య, మధ్యతరగతికి చెందిన కుటుంబాల వారు తమ హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. వాణిజ్య పన్నుల అధికార విజయలక్ష్మి మాట్లాడుతూ జీఎస్‌టీ తగ్గింపుతో వినియోగదారుడికి కొనుగోలు చేసే వస్తువుపై ఎంత మేరకు మిగులు వర్తిస్తోందో తెలుపుతూ బోర్డులను ఏర్పాటు చేసిన ధరలు తగ్గిన వస్తువులతో కూడిని ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఏసీటీవో రమణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కృష్ణ పాల్గొన్నారు.

కోటి సంతకాలతో ప్రజా ఉద్యమం



పోస్టరును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

దేవనకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనపై కోటి సంతకాలతో ప్రజా ఉద్యమం చేస్తామని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. దేవనకొండ క్రాస్‌రోడ్డులో వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల ప్రజాఉద్యమం పోస్టరును ఆవిష్కరించారు. కన్వీనర్ రామకృష్ణ, దివాకర్‌నాయుడు, నారాయణరెడ్డి, లుముంబా, రామాంజినేయులు, శివ, అంజి తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి టౌన్: వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఉన్న 17 మెడికల్ కాలేజీలను పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కే.శ్రీదేవమ్మ స్వగృహంలో, వైసీపీ పార్టీ నాయకులతో కలిసి కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో చెరుకులపాడు ప్రదీప్ రెడ్డి, రాష్ట్ర కమిటీ మెంబర్లు, మండల కన్వీనర్లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, జిల్లా కార్యవర్గ సభ్యులు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆదోని అగ్రికల్చర్ : ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమాన్ని చేపడుతున్నామని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక కార్యాలయం వద్ద సంతకాల ప్రజా ఉద్యమ పోస్టర్‌ను విడుదల చేశారు. రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఫయాజ్ అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, కౌన్సిలర్లు చలపతి, అశోక్, నాయకులు ఏసోబు రామలింగేశ్వర యాదవ్, సునార్ ఖాదర్, గుర్నాథ్ రెడ్డి, నల్లారెడ్డి, జీలే కాబి, శ్రీలక్ష్మి, శ్రీదేవి సుగుణమ్మ పాల్గొన్నారు.

పశువులకు మందులు లేకపోతే ఎలా?



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం రామాంజనేయులు

మద్దికెర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): 'పశువులకు పశువైద్యశాలలో మందులు లేకపోతే ఎలా' అంటూ పెరవలి సర్పంచ్ కారుమంచి మల్లికార్జున అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ అనిత అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లికార్జున, ఎంపీటీసీలు ఆంజనేయులు, రామకృష్ణ మాట్లాడుతూ పశువులు రోగాల బారిన పడుతున్నాయనీ వైద్యశాలకు పశువులను తీసుకెళితే.. మందులు లేవని చెబితే ఎలా అని ప్రశ్నించారు. వివిధ శాఖ అధికారులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రంగస్వామి, ఎంపీడీవో కొండయ్య, ఏపీఎం రామాంజనేయులు, ఏపీవో నర్సిరెడ్డి, విద్యుత్ ఏఈ మహ్మద్ రఫీ, సర్పంచులు బండారు సుహాసిని, అంజనేయులు, మల్లికార్జున, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

అట్టహాసంగా మండల స్థాయి క్రీడా పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం బాలికలకు మండల స్థాయి క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా డిప్యూటీ ఈవో వెంకటరమణా రెడ్డి, శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ ఎర్రిస్వామి, కమ్మిరెడి హాజరై పాఠశాల ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో మంచి ఆరోగ్యం క్రమశిక్షణ నాయకత్వ లక్షణాలను పెంపొందించబడతాయన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు కళ్యాణ్ రావు, నరసింహులు, సుశీలమ్మ, అంజినమ్మ, నాగరాజు పాల్గొన్నారు.

మద్దికెర: ప్రతి క్రీడాకారునికి క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని ఎంఈవో-2 మోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పీఈటీలు, క్రీడాకారులు ఉన్నారు.

తుగ్గలి: క్రమశిక్షణతో క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, మాజీ జిల్లా కోఆప్షన్ మెంబర్ నబీ రసూల్ అన్నారు. శుక్రవారం మండలంలోని రామలింగాయపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. పీఈటీల జిల్లా సంఘం కార్యదర్శి చందు నాయక్, పీఈటీలు వేణు, పాండురంగరాజు, రంగస్వామి, తదితరులు ఉన్నారు.



తుగ్గలిలో పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీమాజీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు

డ్రైవర్‌కు జైలు శిక్ష

ఆదోని రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనదారుడి మృతికి కారణమైన డ్రైవర్ హుసేన్ సాహెబ్‌కు కోర్టు జైలు శిక్ష విధించింది. కోర్టు లైజనింగ్ ఎఎస్.ఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు ఆదోని పట్టణం ఏపిహెచ్‌పి కాలనీలో నివాసం ఉంటున్న గోపీకృష్ణ ద్విచక్ర వాహనంపై 2017 నవంబరు 22న ఆదోని - ఎమ్మిగనూరు రహదారిలో వెళ్తుండగా, జూపాడుబంగ్లాకు చెందిన హుసేన్ సాహెబ్ నాలుగు చక్రాల వాహనంతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గోపీకృష్ణ మృతి చెందాడు. దీంతో మృతుని భార్య అంజనాదేవి తాలుక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కోర్టు విచారణలోభాగంగా, నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఆదోని ఫస్ట్ అడిషనల్ జూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ లీలా సాయి శుభాష్ శుక్రవారం రెండు సంవత్సరాల సాధారణ జైలుశిక్షతోపాటు రూ.10వేలు జరిమానా విధించారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

హాలహర్వి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు అంకితభావంతో పని చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నెట్టికంటమ్మ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వల్ల కొందరికి అందడం లేదని అధికారులుపై ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు మండిపడ్డారు. గోకులం షెడ్లు బిల్లులు ఇంతవరకు రాకపోవడం చాలా ఇబ్బందికరంగా మారిందని, గ్రామాల్లో లబ్ధిదారులు నిలదీస్తున్నారంటూ హాలహర్వి సర్పంచ్ మల్లికార్జున, బాపురం సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఏపీవో చక్రవర్తిని అడిగారు. త్వరలోనే బిల్లులు వస్తాయని, ఇబ్బంది లేదంటూ సమాధానం చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. జడ్పీటీసీ లింగప్ప, డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు, పంచాయతీరాజ్ ఏఈ సోమన్న, ట్రాన్స్ కో ఏఈ జంబన్న పాల్గొన్నారు.

పిల్లల అభివృద్ధిపై బోధన

ఆస్పరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మానసికానికి గురికాకుండా పిల్లల అభివృద్ధిలో శిశు వికాసం మరియు బోధనశాస్త్రంలో అంశాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని జెడ్పీ పాఠశాల, పుటకలమర్రి ఏపీ మోడల్ హైస్కూల్, కేజీబీవీ పాఠశాలల్లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రతిఒక్కరు కూడా మంచి ఉన్నత స్థాయి ఆలోచనతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమారి, స్మైలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌ను వినియోగించండి

ఆదోని టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సోలార్ విద్యుత్‌తో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం సోలార్ కే అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే డా. పార్థసారథి అన్నారు. శుక్రవారం మునిసిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్ లో పొదుపు గ్రూపుల మహిళలతో వెలుగు అధికారులు సమావేశం నిర్వహించారు. పొదుపు గ్రూపు మహిళలు తమ వినియోగం పెరిగేలా చూడాలని సూచించారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ కృష్ణ, వెలుగు అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ సిగ్గుచేటు

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మెడికల్ కళాశాలలను రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం సిగ్గుచేటు అని విద్యార్థి సంఘ నాయకులు, మెడికల్ కళాశాల సాధన కమిటీ గౌరవ అధ్యక్షుడు దేవిశెట్టి ప్రకాష్, షాబీర్ బాష, దస్తగిరి, అఖండ అన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, అక్టోబరు 10. (ఆంధ్రజ్యోతి): రైతుసంక్షేమమే ప్రభుత్వ దేయమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. మండంలోని చినహుల్తి గ్రామంలో ఏవో వెంకటరాముడు ఆద్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రైతులకు రబీసాగుకోసం పప్పుశనగ రాయితీ విత్తనాలను పంపిణీచేశారు. ఏవో వెంకట్రాముడు ఆద్వర్యంలో ఏర్పాటుచేసిన ఈకార్యక్రమంలో ఆయన రైతులనుద్దేశించి మాట్లాడుతూ... గడచిన ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ విత్తనాలను ప్రభుత్వం రైతులకు సకాలంలో పంపిణీ చేసిందని ప్రస్తుతవ రబీసిజన్‌కు సంబందించి పప్పుశనగ విత్తనాలను ముందస్తుగా అందిస్తున్నామన్నారు. ఉల్లిపంటకు ధరలేకపోవడంతో హేక్టారుకు రూ50వేలు పరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి రైతులకు హామీఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, లోకేనాథ్, పరిపూర్ణగౌడ్, తిప్పన్న, ఏఏవో రియాజ్, విహెచ్ఏ రంగాచారి, ఎంపిఈఓ ప్రియాంక రైతులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఊరట

చిప్పగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ తగ్గించడంతో సామాన్య ప్రజలకు ఊరట లభించిందని ఎంపీడీవో అల్లాబకాష్ అన్నారు. శుక్రవారం చిప్పగిరి మండల పరిషత్ కార్యాలయంలో జీఎస్టీ తగ్గింపుపై కలిగే లాభాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సామాన్య, మధ్యతరగతి పేద కుటుంబాలకు జీఎస్టీ తగ్గింపుతో ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేతో ప్రతి ఒక్కరికీ లబ్ధి

తుగ్గలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేతో ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుందని పంచాయతీ కార్యదర్శి గోపాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెండేకల్‌లో స్వామిత్వ ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే చేయించుకోవడంతో వారి ఇంటి హద్దులు, ఇంటి స్థలాలను సురక్షితమైన కొలతలు వేసి వాటిని రికార్డులలో పొందుపరుస్తామన్నారు. ఈ సర్వేతో భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పత్తికొండ టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

బోధనేతర పనులను బహిష్కరిస్తాం

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో బోధనేతర పనులను ఉపాధ్యాయులందరం బహిష్కరిస్తున్నామని ఫ్యాప్టో నాయకులు నాగరాజు వీరచంద్రయాదవ్, గాదిలింగప్ప అన్నారు. శుక్రవారం ఎంఆర్‌సీ భవనంలో డిప్యూటీ ఈవో వెంకటరమణ ఎంఈవో భూపాల్ రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మహాదేవప్ప, శ్రీనివాసులు, సుంకన్న, ముత్తన్న సుధాకర్, రామకృష్ణ, నాగేంద్ర, మల్లికార్జున పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఏఈగా వెంకటేశ్వర్లు

మద్దికెర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మద్దికెర, మండల పంచాయతీరాజ్ ఏఈగా అప్పా వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో సచివాలయ ఏఈ విష్ణు, ఇన్‌చార్జి మండల ఏఈగా పని చేస్తున్నారు. తుగ్గలి నుంచి వెంకటేశ్వర్లును మద్దికెర ఏఈగా బదిలీ చేయడంతో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సచివాలయ ఏఈ విష్ణును బసినేపల్లి, పంపా సచివాలయ ఏఈగా బదిలీ అయ్యారు.

ఆడ పిల్లలను చదివిద్దాం

మద్దికెర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు ఆడపిల్లలను చిన్నచూపు చూడకుండా మంచి చదువులు చదివిద్దామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ త్రివేణి, ఎంపీపీ అనిత అన్నారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో 'భేటీ బచావో.. భేటీ పడావో' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆడపిల్లలు తమను తాము ఎలా రక్షించుకోవాలి.. ఎలా చదవాలి.. విద్యా ఉద్యోగ అవకాశాల గురించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవలను కొనసాగించాలి

ఆస్పరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి కీలకమైన ఎన్టీఆర్ వైద్యసేవలను తక్షణమే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రైవేట్ ఆసుపత్రుల బకాయిలు తక్షణం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. కృష్ణమూరి హనుమంతు,చంద్రశేఖర్, ఈరన్న, కృష్ణ, రవి, వీరశేఖర్, హరి పాల్గొన్నారు.

క్రిష్ణగిరి: రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్య సేవలను కొనసాగించేలా చూడాలని సీపీఐ మండల కార్యదర్శిబోయ బొంతిరాళ్ళ సర్పంచ్ రవి మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం చెల్లించవలసిన 2700 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, పేద ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిలిపేసిన వైద్య సేవలు కొనసాగించాలని కోరారు.

సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన

వెల్దుర్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ సుహాసినమ్మ ఆధ్వర్యంలో 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పై అవగాహన కల్పించారు. 16న జరగనున్న ప్రధాని మోదీ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకుడు సుబ్బారాయుడు, ఏపీఓ లక్ష్మన్న, ఏపీఎం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు కళ్యాణమ్మను కొనసాగించాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పత్తికొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండలపరిధిలోని జెఎం తాండా ప్రభుత్వపాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు కళ్యాణమ్మను ఈపాఠశాలలోనే కొనసాగించాలని గ్రామస్థులు, తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాల ఆవరణంలో ఆందోళనకు దిగారు. గతంలో మూతపడే దశలో ఉన్న పాఠశాలకు బదిలీపై వచ్చిన కళ్యాణమ్మ పాఠశాల రూపురేఖలు మార్చడంతోపాటు పిల్లలకు నూతనవిదానాలతో విద్యాబోదన చేస్తున్నారన్నారు. ఆమె బోధనలో గ్రామంలోని పిల్లలు గురుకుల, మోడల్‌స్కూళ్ల ప్రవేశపరీక్షలలో ఉత్తీర్ణతసాదించి అక్కడ సీట్లుసాదిస్తున్నారన్నారు. అలాంటి ఉపాధ్యాయురాలిని బదిలీపై తమగ్రామంనుండి పంపివేస్తే తిరిగి తమపాఠశాల పాతపరిస్థితికి వస్తుందని ఆమె బదిలీని విద్యాశాఖాదికారులు నిలిపివేయాలన్నారు.

నేడు మండల కమిటీ సమావేశం

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని 17పంచాయతీల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల టీడీపీ అధ్యక్షులతో శనివారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి స్వగృహంలో మండల కమిటీ సమావేశం జరుగుతుందని మండల కన్వీనర్ కె.టి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి మండల కమిటీ సభ్యులు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, గ్రామ కమిటీల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు తప్పక హాజరు కావాలని ఆయన తెలిపారు.

జీఎస్టీ తగ్గింపు ప్రజలకు మేలు

కోసిగి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుతో రైతులకు, ప్రజలకు ఎంతో మేలు అని ఇన్‌చార్జి ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి, ఏడీ వెంకట సుబ్బయ్య అన్నారు. ముందుగా కోసిగిలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఈశ్వరయ్యస్వామి అధ్యక్షతన కోసిగిలో ఎలక్ట్రానిక్స్ వస్తువులపై తగ్గిన జీఎస్టీతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్స్‌లో కొత్త జీఎస్టీతో మార్పులు వచ్చాయని, ఇది ప్రజలు గమనించాలని ఎంతో మేలు అన్నారు. అలాగే పశువైద్యశాలలో ఏడీ వెంకటసుబ్బయ్య రైతులతో మాట్లాడుతూ పశు సంవర్ధక రంగంలో కొన్ని వస్తువులపై జీఎస్టీ 12శాతం నుంచి 5 శాతానికి తగ్గించిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, మండల అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి, నాయకులు వక్రాని వెంకటేశ్, మాణిక్యరాజు, జ్ఞానేష్, ఏపీఎం సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: జీఎస్టీ తగ్గింపుతో నిత్యవసర వస్తువులు, ఎలక్ట్రానిక్ వస్తువుల, ఇరత సామగ్రి ధరలు తగ్గనున్నాయని ఎంపీడీవో మణిమంజరి, మేజర్ సర్పంచ్ హైమావతి అన్నారు. శుక్రవారం గోనెగండ్ల లో నూతన జీఎస్టీ 2.0 పై ప్రజలలోకి తీసుకెళ్లే అవగాహన కల్పించే కార్యక్రమాన్ని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో పలు గ్రామాల కార్యదర్శులు, సతీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గోనెగండ్లలో నూతన జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో మణిమంజరి

మంత్రాలయం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించిన జీఎస్టీవల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీడీశక్ష నూర్జహాన్, ఆదోని కమర్షియల్ ట్యాక్స్ అధికారి నాయక్‌లు అన్నారు. శుక్రవారం స్థానిక సచివాలయం-2లో జీఎస్టీ తగ్గింపు ధరలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎలక్ట్రానిక్స్ వస్తువులైన టీవీ, ఫ్రిడ్జ్, ఎయిర్‌కూలర్ వాటిపై భారీగా జీఎస్టీ త గ్గించడం జరిగిందని అన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమిత్రమ్మ, వెలుగు సీసీ చాముండేశ్వరి, పంచాయతీ కార్యదర్శి సౌజన్య పెద్ద గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బోధనేతర పనులను బహిష్కరిస్తున్నాం

గోనెగండ్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు బోధనేతర పనులు ఎక్కువగా నిర్వహించడం వల్ల విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని అందు చేత బోధనేతర పనులను బహిష్కరిస్తున్నామని ఫ్యాప్టో సంఘం నాయకులు గంగాధర్, కిషోర్, బాబు, రహంతుల్లా, నరసింహులు మౌలాలి అన్నారు. శుక్రవారం గోనెగండ్ల ఎంఈవో నీలకంఠకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో సంఘం నాయకులు అక్బర్, మౌలాలి, నాగరాజు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

వైసీపీ దిగజారుడు ఆరోపణలు మానుకోవాలి

మంత్రాలయం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ దిగజారుడు ఆరోపణలు మానుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ రాఘవేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, జరిగే అభివృద్ధి పనులు, స్థానిక సంస్థల ఎన్నికలపై శనివారం సాయంత్రం 3గంటలకు టీడీపీ విస్తృతస్థాయి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిలుగా మాజీ మంత్రి,కళ్యాణదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, నియోజక అబ్జర్వర్ నెట్టి వెంకటేశ్వర్లు పాల్గొంటారన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సూపర్‌సిక్స్ పథకాలు సూపర్ హిట్‌కావడంతో ఓర్వలేక వైసీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.ఒకవైపు అభివృద్ధి ఒకవైపు సంక్షేమం చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై ఏమిచేయలేక దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, బొజ్జప్ప, చాకలి రాఘవేంద్ర, విజయ్‌కుమార్, నరసింహులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

పెద్దకడబూరు , అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్డిమేకల గ్రామానికి చెందిన తలసేమియా వ్యాధితో బాధపడతున్న బెస్త ఈరన్న కూమారుడు రంగనాథ్‌కు టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి రూ. 10లక్షలు మంజూరైన ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఎంపీ బస్తిపాటి నాగరాజు సిఫారుసు మేరకు రూ 10లక్షల మంజూరైందన్నారు. కార్యక్రమంలో టీడీపి నాయకులు నరసింహ రెడ్డి, నారాయణ రెడ్డి, అయ్యప్ప పాల్గొన్నారు.

బాలుడికి తీవ్ర గాయాలు

మంత్రాలయం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : మంత్రాలయం సమీపంలో అభయ అంజనేయస్వామి వద్ద హైవే రోడ్డు దాటుతున్న రాజేష్ అనే బాలుడ్ని శుక్రవారం మోటర్‌సైకిల్ ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. మంత్రాలయం ఎస్‌ఐ శివాంజల్ తెలిపిన వివరాల ప్రకారం మాధవరం నుంచి ఎమ్మిగనూరుకు గుర్తుతెలియని మోటారుసైకిల్ బెంగుళూరుకుచెందిన భక్తులు అభయఅంజనేయస్వామిని దర్శించుకుంటుండగా రోడ్‌పై ఉన్నబాలున్ని ఢీకొట్టింది. దీంతో రాజేష్ అనే బాలునికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మంత్రాలయం ఎస్‌ఐ సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన బాలున్ని చికిత్స నిమిత్తం ఆదోని ఆసుపత్రికి తరలించారు.మెరుగైన చికిత్స నిమిత్తం బెంగుళూరుకు తీసుకెళ్లారు. మంత్రాలయం పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మోటారుసైకిల్ కోసం మాధవరం, చెట్నహళ్లి గ్రామాల్లో సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

ఓవరాల్ చాంపియన్‌గా కేజీబీవీ జట్టు


మండల స్థాయి క్రీడా పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన కేజీబీవీ జట్టు

కోసిగి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి ఎస్‌జీఎఫ్ సెలక్షన్స్‌లో ఓవరాల్ చాంపియన్‌గా కోసిగిలోని కేజీబీవీ జట్టు నిలిచినట్లు ప్రిన్సిపాల్ షబానా అజ్మిన్, పీఈటీ సుమ తెలిపారు. శుక్రవారం మండల స్థాయి కబడ్డీ, ఖో-ఖో అండర్-14, 17లో కబడ్డీలో 7 మంది, ఖో-ఖోలో ముగ్గురు విద్యార్థులు సెలెక్టు అయ్యారని, అలాగే 100 మీటర్ల లో 4, 6 స్థానాలో హైమావతి, 400 మీటర్లలో రాజేశ్వరి, రెండో స్థానం లో 600 మీటర్లలో వైష్ణవి మొదటి స్థానంలో, రేలీలో రాజేశ్వరి, వైష్ణవి, హైమావతి, హాసిని మొదటి స్థానం సాధించారని అలాగే లాంగ్‌జంప్‌లో వైష్ణవి, అనూషతో పాటు అథ్లెటిక్స్‌లో అన్ని విభాగాల్లో కేజీబీవీకి చెందిన బాలికలు ఓవరాల్ చాంపియన్లుగా నిలిచారన్నారు. మండల స్థాయి నుంచి తాలుకా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారన్నారు.

పెద్దకడబూరు: పెద్దకడబూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో స్కూల్ గేమ్స్ అథ్లెటిక్ పోటీలను టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో యంఈవో రాంమూర్తి, మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ రాఘవేంద్ర, పీడీలు స్వర్ణలత, కృష్ణ, దుబ్బన్న, గోపి పాల్గొన్నారు.

సంతకాల సేకరణ


కోటి సంతకాల సేకరణకు పోస్టర్‌ను విడుదల చేస్తున్న బుట్టా రేణుక, పార్టీ కార్యకర్తలు

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణకు అప్పగించడంపై వ్యతిరేకంగా ప్రజల నుంచి కోటి సంతాకాలను సేకరిస్తున్నట్లు వైసీపీ ఇన్‌చార్జి బుట్టా రేణుక తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బుట్టా రేణుక, రాష్ట్ర పార్లమెంట్ సెక్రటరీ జగన్మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు శివ నిలకంఠప్ప, కె ఆర్ మురహరిరెడ్డి, కార్యకర్తలతో కలిసి మెడికల్ కాలేజిల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం బుట్టా రేణుక మాట్లాడుతూ పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం, వైద్య విద్య అందించాలనే సంకల్పంతో మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి 17 మెడికల్ కాలేజీలను తీసుకొస్తే వాటిని ప్రైవేటీకణ చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. పీపీపీ విధానం పేరిట దాదాపు రూ. లక్ష కోట్లు విలువ చేసే ప్రభుత్వ వైద్య కళాశాల వేలాది ఏకరాల భూములను తన వాళ్లకు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఇందుకు వైసీపీ ప్రభుత్వం పేదల తరఫున ఆక్టోబరు 10 నుంచి వచ్చే నేల నవంబరు 22వ తేదీ వరకు కోటి సంతకాల సేకరణ చేసి, 28వ తేదిన నియోజకవర్గంలో ర్యాలీలు, నిరసనలు చేపట్టబోతున్నట్లు తెలిపారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ నిలిపి, ప్రభుత్వమే నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బషిరెడ్డి, వైస్ ఛైర్మన్ నజీర్, నాగేషప్ప, కోటకొండ నరసింహులు, మూగితి విరుపాక్షిరెడ్డి, కదిరికోట సునీల్, లతారెడ్డి పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో ప్రముఖులు


మంత్రాలయంలో బెంగళూరు ఐజీ సతీశ్‌తో శ్రీమఠం అధికారులు

మంత్రాలయం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర శిశుసంక్షేమ కమిటీ అధ్యక్షులు, నవలగుంద ఎమ్మెల్యే కోనారెడ్డి, దేవదుర్గ ఎమ్మెల్యే కరియమ్మ నాయక్, బెంగళూరు ఐజీ సతీశ్ శుక్రవారం వేర్వేరు సమయాల్లో రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. వీరికి మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట సీఐ నింగప్ప, ఎస్‌ఐలు బసవరాజు, భీరప్ప, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్ ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్రీమఠానికి రూ.1.25 లక్షలు విరాళం

మంత్రాలయం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి కర్ణాటకలోని బెళగామ్‌కు చెందిన జయంత సావల్కార్ అనేభక్తుడు రూ.1.50 లక్షలు అన్నదానానికి, సంపూర్ణ దైనందిక సేవకు విరాళంగా ఇచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి,సురేష్ కోణాపూర్ తెలిపారు. శక్రవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ. 1.25 లక్షలు దైనందికసేవ, రూ.25 వేలు అన్నదానాన్ని నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనంతపురాణిక్, దత్తు స్వామి, నరసింహ దేశాయ్, శ్రీపాదఆచార్ పాల్గొన్నారు.

సీజేఐ గవాయ్‌పై దాడి అమానుషం

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి అమానుషం అని జై భీమ్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షడు చిక్కం జానయ్య అన్నారు. పట్టణంలోని జై భీమ్ ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ సీజేఐ గవాయ్, హరియాణా ఐపీఎస్ పూరన్ కూమార్‌లపై కుల వివక్ష దాడులు జరగడం చాలా దారుణం అన్నారు. దేశంలోని జడ్జిలు, ఐఎఎస్, ఐపీఎస్‌లకే భద్రత లేకపోతే, సామాన్య దళిత గిరిజనుల పరిస్థితి ఎంటని అన్నారు. భారత దేశ ప్రధానికి లేఖ ద్వారా తెలియజేస్తూ ఎస్సీ, ఎస్టీ అట్రాసీటి చట్టాలను పటిష్టం చేసి నాన్ బెయిలబుల్‌గా చేయాలని, దేశంలో నక్సల్స్ సామ్రాజ్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఎలా అంతం చేస్తుందో అలానే కులవివక్షతను, అంటరానితనాన్ని రూపుమాపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుమాల అంతోని, బుజ్జిబాబు, శాంతరాజు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సభను జయప్రదం చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు, నంద్యాల జిల్లాలో 16న ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను జయప్రదం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షులు జెట్టప్ప పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.